మహాత్మా గాంధీకి నివాళి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జాతిపిత మహాత్మా గాంధీకి నగర మేయర్ ఎస్.అముద పూలమాల వేసి నివాళులు అర్పించారు. సోమవారం గాంధీ వర్ధంతి పరిష్కరించుకొని నగర పాలక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ ధనలక్ష్మిలు గాంధీ చిత్రపటానికి నివాళు లర్పించారు. మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, గోపాలకష్ణ వర్మ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రలో 'యువతకు భరోసా'

- నాలుగో రోజు పాదయాత్రకు జననీరాజనం
- పలమనేరు నియోజకవర్గంలో అపూర్వ స్వాగతం

ప్రజాశక్తి- వీకోట: యువకులు చెప్పుకునే కష్టాలకు, ఉపాధి కోల్పోయిన వారి కన్నీళ్లకు, విద్యార్థులు తెలియజేసే సమస్యలకు ఇలా.. ప్రతి ఒక్కరికీ రానున్న తమ ప్రభుత్వంలో అందరికీ న్యాయం చేస్తామన్న భరోసా కల్పిస్తూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు నాలుగో రోజు యువగళం పాదయాత్ర పలమనేరు నియోజకవర్గం లోని వీకోట మండలం లోనికి ప్రవేశించింది. అన్నవరం వద్ద వీకోట మండలం తెలుగుదేశం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున మహిళలు మంగళహారతులతో లోకేష్ బాబుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కారకుంట వద్ద నియోజకవర్గ పరిధిలోని రెడ్డిసామాజిక వర్గం వారితో మమేకమై పాదయాత్ర కొనసాగించారు. పడగలకుప్పం వద్ద పట్టురైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గందారుమాకులపల్లె వద్ద నియోజకవర్గంలోని వడ్డెర సామాజికవర్గం వారు ఏర్పాటు చేసిన సమావేశంలో లోకేష్ ప్రసంగిస్తూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో చేతి వత్తుల వారికి అందించిన ఆదరణ పథకాన్ని జగన్ రెడ్డి ప్రభుత్వం నీరుగార్చారని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో బీసీలకు ఒరిగిందేమీ లేదని ఒట్టి మాటలు చెప్పి మొండి చేయి చూపుతున్నారని ఎద్దేవా చేశారు. ఉపకులాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి నిధులు మంజూరు చేయక బీసీలను మోసగించిన ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు.

పాదయాత్రలో మాట్లాడుతున్న నారా లోకేష్

తెలుగు యువత 'హలో లోకేష్'

స్థానిక జిఎంఆర్ కళ్యాణ మండపంలో నియోజకవర్గ తెలుగు యువత ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో యువతతో మమేకమయ్యారు. ఈ ప్రభుత్వంలో విద్యార్థులకు ఫీజులు సక్రమంగా చెల్లించడం లేదని ఉన్నత చదువులకు అవస్థలు పడుతున్నామని విద్యార్థులు ఏకరుపెట్టారు. గత ప్రభుత్వంలో వీకోటలో ఏర్పాటు చేసిన గార్మెంట్స్ ప్రస్తుత ప్రభుత్వం మూసివేయడంతో ఉపాధి కోల్పోయామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత చదువు చదివిన విద్యార్థులకు పొరుగు రాష్ట్రాలైన బెంగళూరు చెన్నైలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయని, మన రాష్ట్రంలో ఉద్యోగాలు దొరకటం లేదని విద్యార్థులు లోకేష్‌కు విన్నవించారు. మన రాష్ట్రంలో ఉన్నత చదువులకు వ్యవసాయం ఆటోలు టాక్సీలు నడపడమే జీవనోపాధిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు పొందిన యువతకు కారణాలు చెప్పకుండా ఈ ప్రభుత్వంలో ఉద్యోగాలు తొలగించారని నిరుద్యోగులు తమ గోడు వెళ్ళ పోసుకున్నారు. వీటిపై స్పందించిన లోకేష్ బాబు 39400 కంపెనీలను చంద్రబాబు గత ప్రభుత్వంలో తీసుకొచ్చి 5.13లక్షల ఉద్యోగాలు యువతకు కల్పించారన్నారు. జగన్ అధికారం చేపట్టాక రివర్స్ పాలనలో యువత నిరుద్యోగులుగా మారారని రాష్ట్ర భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని ప్రతిఒక్కరు దీన్ని గుర్తించి రాబోయే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

వికోటలో కర్ణాటక పెట్రోల్ కొట్టించిన లోకేష్..

రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం ప్రజల నిత్యావసర వస్తువులతో పాటు డీజిల్, పెట్రోల్ ధరలను అమాంతరం పెంచి ప్రజలపై బాదుడే బాదుడుతో మోయలేని భారాన్ని మోపిందన్నారు. వికోట మండల సరిహద్దు కర్ణాటక రాష్ట్రం పెట్రోల్ బంకులు వద్ద లోకేష్ బాబు పెట్రోల్ కొట్టి ధరల వ్యత్యాసాన్ని వివరించారు. రాష్ట్ర అభివద్ధిని నీరుగార్చి రాష్ట్ర ప్రజలకు ఈప్రభుత్వం అప్పుల ఊబిలోనికి నెట్టివేసిందన్నారు. ప్రభుత్వం ఆదాయ మార్గాలను వదిలి పన్నుల భారాన్ని పోతుందని విమర్శించారు. వారి వెంట మాజీ మంత్రి అమర్నాథ్‌రెడ్డి, చిత్తూరు జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు పులివర్తి నాని, స్థానిక నేతలు రామచంద్ర నాయుడు, రంగనాథ్, రాంబాబు, ధీరజ్, సతీష్ నాయుడు, దామోదర్ నాయుడు పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

'అమర రాజా'లో భారీ అగ్ని ప్రమాదం

- కోట్లలో ఆస్తి నష్టం అంచనా...
- విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణం..
- ఉద్యోగస్తులకు ఎటువంటి ప్రమాదం లేదు
- మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి- యాదమరి:
యాదమరి మండలం చిత్తూరు - బెంగళూరు జాతీయ రహదారి మోర్దానపల్లి సమీపంలో ఉన్న అమర రాజా ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కోట్లలో ఆస్తి నష్టం జరిగిందని సమాచారం. మంటలు పూర్తిగా అదుపు అయితే తప్ప అంచనా వేయలేమంటున్న యాజమాన్యం. అమర్ రాజా ఫ్యాక్టరీలో వివిధ ప్లాంట్లలో బ్యాటరీస్ తయారు చేస్తారు. అందులో ట్యూబులర్ బ్యాటరీ మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్స్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం రాత్రి 7:45 గంటలకు మంటలు చెలరేగాయి. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన ఫ్యాక్టరీ యజమాన్యం మంటలను అదుపు చేయడానికి ఫ్యాక్టరీ సిబ్బందితో సహా రెండు ఫైర్ ఇంజన్లతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేస్తున్నారు. ఫ్యాక్టరీలో భారీ అగ్నికీలలు ఎగసిపడుతుండడంతో మంటలు అదుపు కావడం లేదు. వెంటనే అప్రమత్తమైన ఫ్యాక్టరీ యజమాన్యం ఫ్యాక్టరీలో పనిచేస్తున్న సిబ్బందిని అప్రమత్తం చేసి దూరప్రదేశాలకు తరలించారు. ఈ ప్లాంట్‌లో సుమారు 500 మంది భారీ బ్యాటరీస్ తయారు చేస్తున్నారు. ఫ్యాక్టరీ నందు మంటలు ఇంకా అదుపు కాకపోవడంతో ఫ్యాక్టరీల్లో ఆస్తి ఎంత మేరకు నష్టం వాటిల్లిందని ఇంకా అధికారులు అంచనా వేయడం సాధ్యపడలేదు. యాదమరి, చిత్తూరు పోలీసులు సంఘటనా స్థలంలో భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

మంటల్లో అమర రాజా ఫ్యాక్టరీ

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

డిప్యూటీ సీఎం నారాయణస్వామి

మహిళతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: ప్రజాసమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పెద్దకాలువ పంచాయతీ పరిధిలోని సుందర రాజపురం, ఎన్టీఆర్ కాలనీ, చెర్లోపల్లె గ్రామాల్లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిఇంటికీ వెళ్లి ప్రభుత్వం ఇస్తున్న నవరత్న పథకాల వివరాలను ప్రజల నుంచి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికసమస్యలు ఉన్నప్పటికీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాల పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నదని అన్నారు. దీంతో పాటు విడతల వారీగా అన్నిశాఖల ద్వారా అభివద్ధి కార్యక్రమాలు సైతం చేపడుతున్నామన్నారు. ఈసందర్భంగా పెద్దకాల్వ సర్పంచ్ ఏకాంబరం పంచాయతీ అభివద్ధికి తీసుకోవల్సిన చర్యలపై డిప్యూటీ సీఎంకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్టీసీ వైస్‌చైర్మన్ విజయానంద రెడ్డి, ఎంపీపీ అనిత, ఎంపీడీవో శ్రీదేవి, తహశీల్దార్ ఇన్బనాథన్, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు చిన్నమరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పూర్ణచంద్రారెడ్డి, మాజీ అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, నేతలు గుణశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

'స్పందన' వినతులకు పూర్తిస్థాయి పరిష్కారం

కమిషనర్ డాక్టర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందన కార్యక్రమంలో అందే వినతులను క్షేత్రస్థాయిలో విచారించి పూర్తిస్థాయిలో పరిష్కరించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ విభాగాధిపతులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో భాగంగా కమిషనర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా స్పందన వినతుల పరిష్కారంపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ప్రతి వినతిపత్రాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, నిర్ణీత సమయంలో పరిష్కరించి నివేదించాలని అన్నారు. స్పందన కార్యక్రమంలో మొత్తం పది వినతులు అందాయి. నీటిసరఫరా కోసం బోర్వెల్ ఆపరేటర్‌ను నియమించాలని 12వ వార్డుకు సంబంధించి మహిళలు వినతిపత్రం అందించారు. కొత్తబస్టాండ్ వద్దనున్న నగరపాలక కాంప్లెక్స్‌లో మహిళల కోసం మరుగుదొడ్లు నిర్మించాలని వినతిపత్రం అందించారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ ధనలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న నగర కమిషనర్ అరుణ

జగనన్న చేదోడు పథకంతో

జిల్లాలో 9,477 మందికి రూ.9.47 కోట్లు లబ్ధి

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజాసంకల్ప పాదయాత్రలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి కార్మికులకు, కర్షకులకు ఇచ్చిన మాట మేరకు జగనన్న చేదోడు పథకాన్ని అమలు చేస్తున్నారని జెడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు తెలిపారు. సోమవారం 3వ విడత జగనన్న చేదోడు పథకం కింద ఒక్కొక్క లబ్దిదారులకు రూ.10వేల చొప్పున లబ్ధిని రాష్ట్ర ముఖ్యమంత్రి పల్నాడు జిల్లా వినుకొండ నుండి బటన్ నొక్కి నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఈకార్యక్రమానికి సంబంధించి జిల్లా సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో జెడ్పి ఛైర్మన్‌తో పాటు కలెక్టర్ యం.హరి నారాయణన్, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, చిత్తూరు నగర మేయర్ అముద, మహిళా శిశుసంక్షేమశాఖ రాయలసీమ రీజినల్ ఛైర్‌పర్సన్ శైలజారెడ్డి, జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ సుబ్రహ్మణ్యం, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు హాజరయ్యారు. ఈసందర్భంగా జెడ్పి చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీమేరకు జగనన్న చేదోడు పథకాన్ని అమలు చేస్తున్నరని తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హత కలిగిన రజక, నాయీబ్రాహ్మణ, టైలర్లకు ప్రతిఏడాది రూ.10వేలు చొప్పున 5 సంవత్సరాలలో రూ.50వేలు ఆర్థిక సహాయం అందించడంలో భాగంగా నేడు 3వవిడత కింద జిల్లాకు చెందిన 9,477మంది లబ్దిదారులకు రూ.9.47కోట్లు ఆర్థిక సాయాన్ని లబ్దిదారుల ఖాతాలకు జమ చేయడం జరుగుతున్నదని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యంను అందించేందుకు కషిచేస్తున్నదని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజల సంక్షేమాభివద్ధి లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నవరత్నాలను రూపొందించి తద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. జగనన్న చేదోడు పథకం ద్వారా 3వ విడతలో జిల్లాలోని 6,515 మంది టైలర్లకు రూ.651.50లక్షలు, 1,753మంది రజకులకు రూ.175.30 లక్షలు, 1,209 మంది నాయీ బ్రాహ్మణులకు రూ.120.90లక్షలు మొత్తం 9,477మందికి 9.47కోట్లు లబ్ది చేకూరనుందని తెలిపారు.

6న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సోమవారం చిత్తూరు జిల్లా అంగన్వాడీ జిల్లా కమిటీ సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేంద్రన్, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు హాజరయ్యారు. ఈసందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్. షకీల మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చిత్తూరు జిల్లాలో కూడా ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కనీసవేతనం రూ.26వేలు ఇవావ్వలని, అధికారులు వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, గతంలో పోరాటాలు చేసి సాధించిన ప్రమోషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ మినీ వర్కర్లుగా గుర్తించిన హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. చిత్తూరు జిల్లాలో కుప్పం ప్రాజెక్టులో అంగన్వాడీలను వేధింపులు గురిచేస్తున్న సిడిపిఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమస్యలు పరిష్కారం కోసం ఫిబ్రవరి 6న జరిగే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి సజన అధ్యక్షత వహించగా జిల్లా నాయకులు శ్యామల, బుజ్జి, వి.కుమారి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి షకీలా

స్పందన భవన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలి

జెడ్పి సీఈవో ప్రభాకర్ రెడ్డి

స్పందన భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా పరిషత్ సీఈఓ ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్: నూతన కలెక్టరేట్ ఆవరణంలో నిర్మిస్తున్న స్పందన భవనాన్ని శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన భవన నిర్మాణాన్ని జడ్పీ సీఈఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్పందన భవన నిర్మాణంలో నాణ్యమైన మెటీరియల్‌ను ఉపయోగించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. డిఎల్‌పిఓ ఆఫీసులో సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. స్పందన కార్యక్రమంలో వస్తున్న అగ్రిపై స్వత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని ఆదేశించారు.

జిల్లాలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు

సమన్వయంతో పనిచేయండి : కలెక్టర్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ యం.హరి నారాయణన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్‌కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్‌తో కలిసి జిల్లాలో సుస్థిర అభివద్ధి లక్ష్యాల సాధనకు వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యం, స్పందన, గడపగడపకు మనప్రభుత్వం, ఎంపీ లార్డ్స్‌కు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుస్థిర అభివద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా 8 సూచికలలో విద్యా, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమశాఖలో ప్రధాన అంశాలు కలవని, ఈశాఖలకు కేటాయించిన లక్ష్యాలతో సంబంధింత శాఖలకు గల లక్ష్యసాధనకు కషి చేయాలని సూచించారు. గర్భవతుల్లో, బాలింతలలో అనీమియానివారణకు వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీశిశు సంక్షేమశాఖ సమన్వయంతో పనిచేయాలనని అన్నారు. స్పందనకు సంబంధించి అందిన అర్జీలకు సరైన పరిష్కారంను నిర్ణీత గడువులోపల పరిష్కరించాలని, రీఓపెన్‌కి తావు లేకుండా చూడాలన్నారు. జిల్లాలో రాజంపేట, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు నిధులతో చేపట్టిన పనుల పురోగతిపై అధికారులు దష్టి సారించాలని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా చేపట్టిన పనులలో వేగం పెరగాలని తెలిపారు. ఈసమావేశంలో పంచాయతీరాజ్, ఇరిగేషన్ ఎస్‌ఈలు చంద్రశేఖర్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, సిపిఓ ఉమాదేవి, డిఐఓ డాక్టర్ రవిరాజు, ఆర్‌డబ్ల్యూఎస్‌ఎస్‌ఈ నాగజ్యోతి, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, బీసీ, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్‌శాఖల జిల్లా అధికారులు రబ్బానీ బాష, రాజ్యలక్ష్మి, మూర్తి, డిఎస్ఓ శంకరన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పందనకు 243 అర్జీలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ యం.హరి నారాయణన్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ యం.హరి నారాయణన్, జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్‌లతో కలసి జిల్లా నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. మొత్తం 243 అర్జీలు రాగా, ఇందులో రెవెన్యూ శాఖకు శాఖ సంబంధించి 147, డిఆర్‌డిఏ 80, హౌసింగ్ శాఖ 8, వైద్య మరియు ఆరోగ్య శాఖ 1, ఎక్సైజ్ 1, నగర పాలక సంస్థ 1, ఇరిగేషన్ 1, భూగర్భ గనులశాఖ 1, జిల్లా పరిషత్ 1, డ్వామా 1, ఉపాధి కల్పన 1, అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు జిల్లా కలెక్టర్, జెసి, డిఆర్‌ఓకి తమ వినతులను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల మీద తరచూ సమీక్షిస్తున్నారని, జిల్లా అధికారులు స్పందన ద్వారా అందిన అర్జీలపై సత్వరం చర్యలు తీసుకుని పరిష్కరించాల్సిందిగా జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఓలను, జిల్లా అధికారులను ఆదేశించారు.

యువగళం విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో ఫిబ్రవరి 9 నుంచి ప్రారంభం కానున్న మాజీ మంత్రి నారా లోకేష్ నిర్వహించనున్న యువగళం పాదయాత్రను సమిష్టిగా విజయవంతం చేయాలని నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ భీమనేని చిట్టిబాబునాయుడు, పరిశీలకులు మబ్బు దేవనారాయణరెడ్డి, బొమ్మి సురేంద్రయాదవ్ లు అన్నారు. సోమవారం గంగాధర నెల్లూరులో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 8వ తేదీ మండల పరిధిలోని ఆత్మకూరు పంచాయతీ పరిధిలోని దేవాలయం మెట్ట వద్ద ఉన్న ముత్యాలమ్మ గుడి వద్ద నారా లోకేష్ బస చేస్తారన్నారు. 9న ఆత్మకూరు, కడప గుంట ,చిన్నపంజేరి ,తూగుండ్రం పంచాయతీల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆత్మకూరు చర్చిలో క్రైస్తవ సోదరులతో, ఆవలకొండలో మైనారిటీ ల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటుచసామన్నారు. పాలసముద్రం మండలం రంగాపురంకు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో నారా లోకేష్ ప్రసంగిస్తారన్నారు. రంగాపురం మీదుగా శ్రీరంగరాజపురం చేరుకుని బడుగు బలహీన వర్గాల ప్రజలతోపాటు ప్రజలతో మమేకమై ప్రజల విజ్ఞప్తులను తెలుసుకోనున్నారు. నాలుగో రోజు కార్వేటినగరం మండలం సురేంద్ర నగరం మీదుగా పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నారా లోకేష్ వెంట రెండువేల మంది కార్యకర్తలు ఆయన వెంట పాదయాత్ర చేయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి క్రిష్ణమనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్ ,జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, నేతలు నియాజ్ అలీ, ప్రభాకర్ నాయుడు, ప్రకాష్ నాయుడు, కోదండ రెడ్డి, నీరజాక్షులు రెడ్డి, జ్యోతి యాదవ్, కండిగ శంకర్ పాల్గొన్నారు.

గుడిపల్లి: నారా లోకేష్ పలమనేరు నియోజకవర్గం వి.కోట మండలంలో నాలుగవ రోజు పాదయాత్రలో గుడిపల్లి మండల ం నాయకులు భారీగా పాల్గొని పాదయాత్రకు సంఘీభావం తెలిపారు . కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు టి.ఎం. బాబు నాయుడు, క్లస్టర్ ఇన్ఛార్జి హేమంబర్ గౌడు, సర్పంచ్ గోపాల్, యూనిట్ ఇన్చార్జులు సుబ్రమణి, వెంకటేష్, మాజీ సర్పంచ్ రమేష్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాలను ఉద్యమ నిలయాలుగా మారుస్తాం

ప్రజాశక్తి-క్యాంపస్: స్థానిక శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు చిన్న మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని విశ్వవిద్యాలయాల్లో ప్రస్తుతం పని చేస్తున్న ప్రొఫెసర్ల వద్ద నుంచి రెండు, మూడు నెలల జీతాలు తీసుకొని వాళ్లకు వయోపరిమితి 65 సంవత్సరాలకు పెంచడానికి నిర్ణయం తీసుకున్నట్లు వస్తున్న వార్తలను గుర్తించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో హయ్యర్ ఎడ్యుకేషన్ చేసిన ఎన్నో వేల మంది విద్యార్థులు నిరుద్యోగులుగా రోడ్లమీద తిరుగుతా ఉంటే విశ్వవిద్యాలయాల్లో ఏ ఒక్క ప్రొఫెసర్ల పోస్టులు భర్తీ చేయకుండా ఉన్న ప్రొఫెసర్ వయోపరిమితి 62 నుండి 65 సంవత్సరాలకు పెంచడానికి ఏఐఎస్ఎఫ్ గా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికే అన్ని విశ్వవిద్యాలయాలకు సంబంధించి ఎంత మంది ప్రొఫెసర్లు రెగ్యులర్ గా పాఠాలు చెబుతున్నారో ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎంతోమంది టీచింగ్ అసిస్టెంట్లు దాదాపు 20 నుండి 30 సంవత్సరాలు వర్సిటీలలో పనిచేస్తున్నప్పటికీ అసిస్టెంట్ ప్రొఫెసర్ నోటిఫికేషన్ రాక ఇబ్బంది పడుతున్నారని, ఈ తరుణంలో 65 సంవత్సరాలకు ప్రొఫెసర్ల వయోపరిమితి పెంచితే కొత్త యువతరం నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నోటిఫికేషన్ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో 65 సంవత్సరాలు పెంచాలని చూస్తే విశ్వవిద్యాలయాల్లో ఉద్యమ నిలయాలుగా మారుస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర నాయక్, చక్రి, సురేంద్ర, గిరిబాబు, శీను, హేమంత్, రాజశేఖర్, మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు భాషా సాహిత్యాన్ని చేరువ చేయాలి

ప్రజాశక్తి-క్యాంపస్: ప్రస్తుత తరానికి తెలుగు భాషా సాహిత్యాన్ని చేరువ చేయడంతో సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె.రాజారెడ్డి అన్నారు. వర్సిటీ తెలుగు విభాగంలో ఐదు రోజుల పాటు నిర్వహించే వర్క్ షాప్ ను సోమవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. 'తెలుగు బోధన, ప్రశ్నావళిని రూపొందించడం, మూల్యాంకనం చేయడం' వంటి అంశాలపై మైసూరు లోని భారతీయ భాషల అధ్యయన కేంద్రం (సీఐఐఎల్) ఆర్థిక సహకారంతో ఈ వర్క్ షాప్ ఏర్పాటు చేశారు. తెలుగు విభాగాధిపతి ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ సభకు వీసీ ఆచార్య కె. రాజా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పోతన కవిత్వంలోని మాధుర్యం, వేమన పద్యాల్లోని తాత్త్వికత, అన్నమయ్య కీర్తనల్లోని ఆధ్యాత్మికత మేళవింపు తెలుగు సాహిత్య వైభవానికి సంకేతమని అన్నారు. సాహిత్యంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించాలని కోరారు. మారుతున్న కాలానుగుణంగా సాహిత్యానికి సాంకేతికతను జోడించాలని సూచించారు. విద్యార్థులకు మంచి విజ్ఞానాన్ని అందించడం, మంచి ఫలితాలను సాధించడానికే ఉపాధ్యాయులు పరిమితం కాకూడదని స్పష్టం చేశారు. వర్క్‌షాప్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. వర్క్ షాప్ డైరెక్టర్ ఆచార్య రాజేశ్వరమ్మను అభినందించారు. భారతీయ భాషల అధ్యయన కేంద్రం (సీఐఐఎల్) అధికారి డాక్టర్ పంకజ్ ద్వివేది మాట్లాడుతూ ఎంతోమంది తెలుగు భాషా, సాహిత్య రంగ పరిశోధకులు పనిచేసిన తెలుగు విభాగంలో వర్క్‌షాప్ నిర్వహించడం గర్వకారణమని చెప్పారు. సీఐఐఎల్ పరిధిలోని నేషనల్ టెస్టింగ్ సర్వీస్ (ఎన్ టి ఎస్) ప్రతినిధి డాక్టర్ బి. బీరేష్ కుమార్ మాట్లాడుతూ ఈ తరం విద్యార్థులకు మంచి విజ్ఞానాన్ని అందించేందుకు ముందుగా ఉపాధ్యాయులను ప్రస్తుత పరిస్థితులు కనుగుణంగా తయారు చేసుకోవాలన్నారు. మంచి ప్రశ్నావళిని రూపొందించడం, విద్యార్థుల ప్రతిభను పరీక్షించడం, వారి ప్రతిభను మూల్యాంకనం చేయడం వంటి అంశాలపై ఈ వర్క్ షాప్ ద్వారా అవగాహన కల్పిస్తామని తెలిపారు. అకడమిక్ అడ్వైజర్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ పేట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తెలుగు విభాగంలో ఆచార్య జీఎన్ రెడ్డి అధ్యాపకుడిగా ఉండి దేశంలోనే తొలిసారిగా వైస్ ఛాన్సలర్ అయిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. తెలుగు విభాగాధిపతి ఆచార్య ఆర్ రాజేశ్వరమ్మ మాట్లాడుతూ రాయప్రోలు సుబ్బారావు, పింగళి లక్ష్మీకాంతం, కోదండరామయ్య, కొలకలూరి ఇనాక్, ఆచార్య నాగయ్య, కేతు విశ్వనాథరెడ్డి, భద్రిరాజు కష్ణమూర్తి వంటి ఎంతోమంది ఉద్దండులు తెలుగు విభాగంలో ఎంతో కషి చేశారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజాన్ని నిర్మిద్దాం..!

కార్వేటినగరంలో మచ్చలను పరిశీలిస్తున్న వైద్యులు

రొంపిచెర్లలో అవగాహన ర్యాలీ

బంగారుపాళ్యంలో...

ప్రజాశక్తి- కార్వేటినగరం: కుష్టు రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ అన్నారు. సోమవారం ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కుష్టు వ్యాధి నివారణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కుష్టు వ్యాధి మైక్రో బ్యాక్టీరియా అనే సూక్ష్మ జీవి వల్ల లెప్రసీ సోకుతుందన్నారు. కుష్టు వ్యాధితో బాధపడుతున్న వారు తుమ్మడం, దగ్గడం కారణంగా ఆ తుంపర్లు పడటంతో ఆవ్యాధి సోకుతుందన్నారు. రాగి రంగు కలిగిన స్పర్శ లేని మచ్చలుంటే అవి కుష్టు వ్యాధి లక్షణాలుగా గుర్తించ వచ్చని పేర్కొన్నారు. అలాంటి మచ్చలు ఉన్నట్లు గుర్తించినట్లయితే వెంటనే ఆశా కార్యకర్త లేదా ఏఎన్ఎంలకు తెలిపాలని సూచించారు. అనంతరం డిపీఎంది డాక్టర్ యూజన్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష చూపకూడదన్నారు. వారిని ఆదరించాలని సూచించారు. కుష్టు వ్యాధిని మొదటి దశలో గుర్తించినట్లయితే ఎండీటీ మందుల ద్వారా ఆరు నెలల నుంచి 12 నెలల లోపు మందులు వాడడంతో నయమవు తుందన్నారు ముందు జాగ్రత్తలు తీసుకోక పోవడంతో శరీర అవయవాలు కుంటుబడే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వెంకటరమణరాజు మోహన్. హెల్త్ సూపర్వైజర్ భాస్కరయ్య, పాఠశాల హెచ్ఎం వసుమతీదేవి పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచెర్ల: రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ రాజా, డాక్టర్ దినేష్ ఆధ్వర్యంలో రొంపిచెర్ల క్రాస్‌లోని మోడల్ స్కూల్ లో కుష్టు వ్యాధిపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మహాత్మా గాంధీజీ వర్ధంతి సందర్భంగా మహాత్మా గాంధీకి నివాళు లర్పించారు. వ్యాధిని ఎంత త్వరగా గుర్తిస్తే వారికి అంగవైకల్యం కలగకుండా కాపాడవచ్చన్నారు. ఈ వ్యాధికి చికిత్స పూర్తిగా ఉచితంగా ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఈ వ్యాధికి సంబంధించిన మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్‌వైజర్. పంకజ, ఎంఎల్‌హెచ్‌పీ సాయిపూజిత, ఏఎన్ఎం గాయత్రి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యాదమరి: యాదమరిలో ఎస్సై సుమన్, యాదమరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో సోమవారం కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సిబ్బంది ర్యాలీ మానవహారం నిర్వహించారు. సిహెచ్ఓ మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని మచ్చలు కుష్టు వ్యాధి లక్షణాలు కావచ్చన్నారు. మందమైన మెరిసే జిడ్డుగల చర్మం బత్తాయి తొక్క లాగా ఉండటం, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని డుడిపెలు, కనుబొమ్మలు కనురెప్పల వెంట్రుకల రాలిపోవడం కుష్టు వ్యాధి లక్షణాలు కావచ్చన్నారు.

చిత్తూరు అర్బన్: కుష్టు వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుండి గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని నగర మేయర్ అముద ప్రారంభించారు. గాంధీ విగ్రహం ఎదుట వ్యాధి నివారణ కోసం ప్రతిఒక్కరూ కషి చేయాలని నగర మేయర్ అముదా డీఐఓ రవిరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిరాజ్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ప్రతి ఏడాది జనవరి 31వ తేదీన కుష్టు వ్యాధి నివారణ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుష్టు వ్యాధిపై అవగాహన పెంచుకొని ప్రతి ఒక్కరూ ఈ వ్యాధి నిర్మూలన కోసం కషి చేయాలని కోరారు.

పాలసముద్రం: గ్రామాల్లో ప్రస్తుత వాతావరణ మార్పులతో వచ్చే సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ప్రజల ఉండాలని వైద్య అధికారి మోహన్ కష్ణ తెలిపారు. శనివారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలకు సూపర్వైజర్ సుశీల, మురళి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రస్తుతం కురిసిన వర్షాలకు అక్కడక్కడ నీళ్లు నిలిచిపోయి అందులో దోమలు వద్ధి చెంది ప్రజలకు పలు రోగాలు వచ్చే అవకాశం ఉన్నది, అందువల్ల ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు కలిసి వర్షపు నీరుని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు, అనంతరం కుష్టు వ్యాధిపై ఆరోగ్య కేంద్రం నుంచి పాలసముద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమల: కుష్టు వ్యాధి నిర్మూలన కోసం ప్రతిఒక్కరూ వైద్య సిబ్బందికి సహకరించి వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా

యాదమరిలో ర్యాలీ

పాలసముద్రంలో...

సోమలలో...

అడుగులు వేయాలంటూ వైద్య సిబ్బంది విద్యార్థులతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలలో భాగంగా ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు రోజూ వ్యాధిపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా మందులు అందజేస్తున్నారని పేర్కొన్నారు. స్పర్శ లేని మచ్చలు, చర్మంపై కురుపులు, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం, అరచేతులు, కాళ్లల్లో స్పర్శ కోల్పోవడం కుష్టు వ్యాధి లక్షణాలని తెలిపారు. సదుం మండలంలోని చెరుకువారిపల్లి వైద్యాధికారిని గిరీషారెడ్డి, సోమల వైద్యాధికారి జయసింహ, పెద్ద ఉప్పరపల్లి వైద్యాధికారిని రమ్యశ్రీ, ఏఎన్ఎంలు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: స్పర్శ లేని మచ్చలను గుర్తించాలని తుంబకుప్పం ప్రాథమిక వైద్యులు లోహిత్ చెంగల్రాయులు అన్నారు. సోమవారం మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీలో కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో 104 వైద్యాధికారి ప్రతాప్, సి హెచ్ హెచ్ఓ షమీమ్, దిలీప్, దీప, పునీత్, సచివాలయం ఆరోగ్యకర్త రోజా రమణి ఫ్యామిలీ ఫిజీషియన్ సిబ్బంది సుబ్రమణ్యం, ఆశ కార్యకర్తలు, భువనేశ్వరి, పుణ్యవతి, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు అన్ని సంఘాలు కలిసి రావాలి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సమస్యలపై పోరాటాలకు అన్ని సంఘాలు కలిసి రావాలని ఏపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శివయ్య కోరారు. సోమవారం వివిధ ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ఏ సంఘం పోరాడిన మిగిలిన సంఘాలు దానికి మద్దతు పలకాల్సింది పోయి వ్యతిరేకించడం తగదన్నారు. ఒకప్పుడు అందరూ కలిసికట్టుగా ఉన్న సమయంలో ఏపీ ఎన్జీవో సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోట్లాది రూపాయల విలువచేసే భవనాలను నిర్మించుకోవడం జరిగిందని అయితే నేడు ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ని వ్యతిరేకించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు నాయుడు మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం ఉద్యోగులు పెన్షన్ పైనే ఆధారపడి జీవిస్తారని అయితే ఆ పెన్షన్ కూడా సకాలంలో ప్రభుత్వం అందించకపోవడం దారుణమని దీనిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గవర్నర్ను కలిసి వినతి పత్రం ఇవ్వడం సమంజసమేనని ఆయన పేర్కొన్నారు. ఎం పి హెచ్ ఈ ఓ సి హెచ్ ఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులు వారికి రావాల్సిన బకాయిలు గురించి ప్రశ్నించడం తప్పేనా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ లు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా ఉద్యోగుల తలరాతలు మాత్రం మారలేదని, ఉద్యోగుల జీతభత్యాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కోరిన మేరకు జీవో చేయాల్సిందేనని స్పష్టం చేశారు. రాజకీయ నాయకుల జీతభత్యాలకు ప్రభుత్వం జీవోలు విడుదల చేస్తున్నప్పుడు 60 సంవత్సరాల పాటు ప్రభుత్వ ఉద్యోగాన్ని తమ దైవంగా భావించి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు హక్కులకు సంబంధించి జీవో చేయడంలో ఎలాంటి తప్పిదం లేదని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. మినిస్టర్ సర్వీసెస్ జిల్లా సెక్రెటరీ శరత్ బాబు మాట్లాడుతూ ఉద్యోగులు ఒకటో తారీకు జీతం రాకపోవడంతో వాళ్ల ఉద్యోగ బాధ్యతలు కూడా సక్రమంగా నిర్వహించే పరిస్థితి లేదన్నారు. ఉద్యోగులకు సొంతింటి కల కలగానే ఉందని అద్దె ఇంటిలో కాపురం చేస్తూ ఒకటవ తారీఖు కల్లా చెల్లించుకుంటే ఇంటి యజమానులు ఉద్యోగులను దొంగల్లా చూస్తారని.. ఈ విషయాలు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గవర్నర్ కు చేసిన వినతి ప్రకారం ఉద్యోగులకు సంబంధించిన జీతభత్యాలు పెన్షన్లకు సంబంధించి జీవో చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా శిశు మరియు శ్రీ సంక్షేమ శాఖ లో పనిచేస్తున్న హరి ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం సత్వరం పరిష్కరిస్తే గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చే పరిస్థితి రాదన్నారు. ఒకటో తారీకు తమ జీతాలు ఇచ్చేలా చూడాలని గవర్నర్ ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందించడం సమంజసమేనన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి హరి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఏప్రిల్ నుంచి కార్యాచరణ ప్రారంభించాలని గతంలోని ప్రకటించడం జరిగిందని అయితే అది ఇంకాస్త ముందుగా ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమవుతతోందన్నారు. ఉద్యోగులందరూ ఒకే తాటిపై కొచ్చి మన హక్కుల సాధనకు ఉద్యమించాలని హరిప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహిళా విభాగం జిల్లా కార్యదర్శి లలిత, కోశాధికారి శైలజ మాట్లాడుతూ ఉద్యోగులకు ఉద్యోగం తప్ప వేరే వ్యాపారాలు లేవని ఒకటో తారీకు జీతం వస్తేనే తాము ప్రశాంతంగా ఉద్యోగం చేసుకోగలుగుతామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నరేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఉద్యోగులకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. పాదయాత్ర సమయంలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా ఉద్యోగులకు నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చర్చా వేదికలో పాల్గొన్న అన్ని సంఘాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కే.ఆర్. సూర్యనారాయణ, జి. ఆస్కారావ్ లు గవర్నర్ ను కలిసి వినతి పత్రం అందించడంలో ఎలాంటి తప్పిదం మాకు కనిపించడం లేదన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా నాయకులు అయ్యప్ప ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహిళ విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు కర్ణం భారతి, చిత్తూరు తాలూకా అధ్యక్షులు ఫిలిప్స్ కుమార్, బంగారు పాల్యం తాలూకా కార్యదర్శి సురేంద్ర నాథ రెడ్డి, పలు సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి తమ మద్దతును ప్రకటించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై కేఆర్ సూర్యనారాయణ, జి ఆస్కారావ్ నాయకత్వంలో అన్ని ఉద్యోగ సంఘాలు ఏకత్రాటి పైకొచ్చి సమస్యల సాధకు పోరాటానికి వారి మద్దతును ప్రకటించారు.

వకుళామాత ఆలయ సందర్శన

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, కంప్యూటర్ సైన్స్ విభాగపు కో ఆర్డినేటర్ ఆచార్య ఎన్.ముత్తులక్ష్మి ఆధ్వర్యంలో ఆజాదీ కా అమత్ మహోత్సవం వేడుకలో థీమ్ కల్చరల్ ప్రైడ్ యూనిటీలో భాగముగా విభాగపు ఎంసీఏ విద్యార్థులు చంద్రగిరి కోటను, వకుళా మాత ఆలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో డీన్ ఆచార్య సావిత్రి, విభాగాధిపతి ఆచార్య ఎం ఉషారాణి, విభాగపు ఆచార్యులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి గోడపత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: తలకోన సిద్దేశ్వరస్వామి ఆలయంలో వచ్చేనెల 15 నుంచి 19 వరకు జరగబోయే మహాశివరాత్రి ఉత్సవాల గోడపత్రికలను చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోమవారం తుమ్మలగుంటలోని తన నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే పాలక మండలి సభ్యులతో మాట్లాడుతూ తలకోన ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగాలని.. శివరాత్రి ఉత్సవాలపై ప్రచారం చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలు, పోలీసు బందోబస్తు, దర్శన ఏర్పాట్లు చేయాలని ఈవో జయకుమార్ ని ఆదేశించారు. కార్యక్రమంలో ఛైర్మన్ ఉమామహేశ్వర్ రెడ్డి, మాజీ ఛైర్మన్ రేవతి రెడ్డి, ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెమ్మసాని సుమన్‌నాయుడికి సన్మానం

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్: రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శిగా ఎంపికైన పెమ్మసాని సుమన్‌నాయుడును పుత్తూరులోని ఎంబీ రోడ్డులో పార్టీ కార్యాలయంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగ కార్యదర్శి ఇనుగుర్తి రవినాయుడు ఆధ్వర్యంలో ఘనంగా గజమాలతో సన్మానించారు. సుమన్‌నాయుడు మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్రలో అందరూ పాల్గొని పార్టీ అభివద్ధికి కషి చేస్తామన్నారు. జిల్లా టీఎన్‌టీయూసీ ప్రకాష్ చంద్రయాదవ్, రవి యాదవ్, మునెయ్య, రమేష్, వంశీనాయుడు, మేఘనాధం, మణి పాల్గొన్నారు.

భీములవారిపాళ్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-తడ: మండలంలోని భీములవారిపాళ్యంలో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇంటికే చేరుతాయని తెలిపారు.

21 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-సోమల: సోమల పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెళు తూ పోలీసులు ఆపినా ఆగకుండా వెళ్లిపోవడంతో వారిని వెంబడించారు. పోలీసులు చివరికి వారిని పట్టుకుని తమదైన శైలిలో విచారించగా రూ.25 లక్షలు విలువ చేసే 21 ద్విచక్ర వాహనాలను చోరీ చేసి ఓ చెరుకు తోటలో దాచిపెట్టి ఉండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చౌడేపల్లి రూరల్ సీఐ మధుసూదన రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ముందస్తు సమాచారం మేరకు ఆవుల పల్లె పంచాయతీ మల్లేశ్వరపురం శివాలయం వద్ద సోమల ఇన్‌ఛార్జి ఎస్ఐ మారుతి సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా పల్సర్ వాహనంపై వచ్చిన ముగ్గురిని పోలీసులు చూసి వాహనాన్ని ఆపినా కూడా ఆపకుండా వెళ్లిపోవడంతో వారిని సిబ్బందితో సహా ఎస్సై వెంబడించి పట్టుకొని విచారించారు. ఈ సందర్భంగా వారు చెప్పిన వివరాల మేరకు గత ఏడాది డిసెంబర్ ఏడాది జనవరిలో మొత్తం 21 ద్విచక్ర వాహనాలను ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుండి చోరీ చేసి సోమల మండలంలోని చింపి రెడ్డి గారి పల్లి వద్దనున్న చెరుకు తోటలో దాచి పెడుతూ వచ్చారు. ఈ వాహనాలు సోమల 5, చౌడేపల్లి 4, గంగవరం 3, పెద్దపంజాణి 4, కర్ణాటక రాష్ట్రంలోని శ్రీనివాసపురం, చిల్లగట్ల ప్రాంతాలలో చోరీ చేసినట్లు ఒప్పుకున్నారని, ఇప్పటికే ఆయా సంబంధిత మండల పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్టు సీఐ తెలిపారు. కాగా చోరీ చేసిన ముగ్గురిలో ఒకడైన రాగింటి సంతోష్ చౌడేపల్లి మండలానికి చెందిన వాడని మిగిలిన ఇద్దరూ మైనర్లు కావడంతో వారి పేర్లు వెల్లడించలేదు. సంతోష్ ను పుంగనూరు కోర్టుకు, ఇద్దరు మైనర్ లను తిరుపతి కోర్టుకు తరలించనున్నట్లు సీఐ తెలిపారు. కాగా మూడు ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన ప్రాంతం వివరాలను నిందితులు చెబుతున్నా సంబంధిత పోలీస్ స్టేషన్లో ఎలాంటి కేసు నమోదు కాకపోవడం వల్ల ఆ మూడు ద్విచక్ర వాహనాల వివరాలను కూడా తెలుసుకుంటున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ షామీర్ భాష, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిల్లకూరులో 32 వాహనాలు...

ప్రజాశక్తి-చిల్లకూరు: గూడూరు రూరల్ సర్కిల్ పరిధిలోని 32 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు గూడూరు డివిజన్ డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. రూరల్ సీఐ దశరథ రామారావు ఆధ్వర్యంలో రూ.27 లక్షలు విలువైన 32 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: ఆర్థిక అక్షరాస్యతపై చిన్నపాండూరు సప్తగిరి గ్రామీణ బ్యాంక్ వారు నాబార్డ్ సౌజన్యంతో అవగాహన సదస్సును సోమవారం పాండూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ ఆఫీసర్ జయశేఖర్ పొదుపు ద్వారా బ్యాంకు రుణాలను అధిక మొత్తంలో పొంది కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవాలన్నారు. సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వివేకానంద, అసిస్టెంట్ మేనేజర్ కష్ణ, పొదుపు మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలు అందించాలి

ప్రజాశక్తి-కేవీబీపురం: మండలంలో సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి దాసరి జనార్ధన్ మాట్లాడుతూ కేవీబీపురం మండలం వగత్తూరు రెవెన్యూ గ్రామంలో ప్రభుత్వ డీకేటీ భూములను శ్రీనివాసపురం గ్రామంలోని పేదలు 50 మంది గత 20 సంవత్సరాలుగా సాగులో ఉన్నారని.. రెవెన్యూ అధికారులు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ స్థానికేతరులకు పట్టాలిచ్చి పేదలపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సూళ్లూరుపేట మండలంలోని మతకమ్మడి గ్రామంలో ప్రభుత్వ భూమి 300 ఎకరాలలో స్థానిక పేదలు సాగులో ఉంటే రెవెన్యూ అధికారులు పట్టాలివ్వకుండా రైతులను వేధిస్తున్నారని విమర్శించారు. అనంతరం రెండు గ్రామాల ప్రజలు జిల్లా కలెక్టర్‌కు అర్జీలు అందించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నాగరాజు, శ్రీనివాసపురం మాజీ సర్పంచ్ దేవరాజులు, శేఖర్, బాలాజీ, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

లింగ అసమానతలు అభివృద్ధికి అడ్డంకులు

ప్రజాశక్తి-క్యాంపస్: మహిళా సాధికారతలో పురుషుల భాగస్వామ్యాన్ని, బాధ్యతను తెలియజేసేందుకు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళ అధ్యయన విభాగం, కేంద్ర విభాగాధిపతి డాక్టర్ నీరజ నిర్వహిస్తున్న రోల్ ఆఫ్ బాయ్స్ అండ్ జెండర్ ఈక్వాలిటీ , అనే వర్క్ షాప్ సిరీస్ లో భాగంగా, కార్వేటి నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పురుష విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న జెండర్ అసమానతల వల్ల కేవలం మహిళలే కాకుండా పురుషులు కూడా బాధింపబడుతున్నారని, అవాస్తవిక పురుషత్వ, స్త్రీ భావజాలాన్ని పిన్నవయసు నుండి పిల్లల పైన రుద్దడం ద్వారా అనేక రకాల అసమానతలకు దారితీసి స్త్రీ పురుషులు ఇరువురికి హాని కలిగిస్తున్నాయన్నారు.

తహశీల్దారు కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ : బుచ్చినాయుడుకండ్రిగ తహసీల్దారు కార్యాలయాన్ని సోమవారం సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు ఇళ్ల స్థలాల కోసం ఆక్రమించుకుని రాళ్లు నాటారు., రెవెన్యూ సిబ్బంది గుడిసెలను తొలగించారు. ఈ విషయమై విచారించి చర్యలు తీసుకుంటామని.. తహశీల్దారు చంద్రశేఖర్‌నాయుడుతో చర్చించి నిజంగా ఇళ్ల స్థలం లేని లబ్ధిదారులకు న్యాయం చేస్తామని.. కార్యాలయం వద్ద ఎలాంటి ధర్నాలు చేయరాదని సర్ది చెప్పి పంపారు.

నవోదయ విద్యాలయకు దరఖాస్తులు పొడిగింపు

ప్రజాశక్తి-క్యాంపస్: స్థానిక తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రంలో 2022-2023 విద్యా సంవత్సరానికి జాతీయ స్థాయి జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతి ప్రవేశానికి సంబందించిన దరఖాస్తుల సమర్పించడానికి ఫిబ్రవరి 8 వరకు పొడగించినట్లు తెలిపారు. విశ్వం ఉచిత పోటీ పరీక్షల సమాచార కేంద్రంలో సమాచారం పొందవచ్చని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.యన్.విశ్వ నాథ్ రెడ్డి తెలియజేశారు. వివరాల కొరకు 8688888802 / 9399976999 ఫోన్ నంబర్లను సంప్రదించగలరని కోరారు.